క్లుప్తంగా

జేఈఈ పుస్తకాలు గ్రంథాలయానికి అందజేత

ఉంగుటూరు: ఉంగుటూరు శాఖా గ్రంథాలయానికి గ్రామానికి చెందిన డీఎఫ్‌వోగా పని చేస్తున్న ప్రభాకరరావు జేఈఈ పుస్తకాలు ఆదివారం అందజేశారు. ఈ పుస్తకాలు జేఈఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉపయోగపడతాయని డీఎఫ్‌వో తెలిపారు. సామాజిక కార్యకర్త తల్లాప్రగడ భీమేశ్వరరావు ద్వారా ఈ పుస్తకాలను గ్రంథపాలకుడు గంగాధరరావుకు అందజేశారు.

గ్రామాల్లో 144 సెక్షన్ అమలు


పెదపాడు ఎస్సై శుభశేఖర్

పెదపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉందని పెదపాడు ఎస్సై శుభశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ డీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు 144 సెక్షన్‌తోపాటు పోలీసు యాక్ట్ సెక్షన్ 30 అమలులో ఉందని చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతి లేకుండా ప్రజలు ఎక్కడా గుంపులుగా ఉండరాదని చెప్పారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నట్లు నాయకులు గుర్తుపెట్టుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయులంతా సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

భీమడోలు: విద్యా సంస్కరణల్లో భాగంగా సాంకేతికతను అందిపుచ్చుకుని ఇంటరాక్టివ్ ఫ్లాట్ ఫ్లానెల్స్ ఆపరేట్ చేసిన హెచ్‌ఎంలను విద్యాశాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ అభినందించారు. ఈనెల 18న శనివారం గుండుగొలను, భీమడోలు ఉన్నత పాఠశాలలను సందర్శించిన ఆయన ప్రభుత్వం చేపట్టిన విద్యా సంస్కరణలకు అనుగుణంగా పాఠశాలలకు అందించిన ఐఎఫ్‌పీలను గుండుగొలను హెచ్‌ఎం జి.సునీత స్వయంగా ఆపరేట్ చేసిన విధానాన్ని ఆయన అభినందించారు. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలను సందర్శించిన నేపథ్యంలో మహిళా హెచ్‌ఎంలు ఫ్లానెల్స్‌ను వినియోగించే విధానంపై అవగాహన లేక ఆపరేట్ చేయడం లేదని ఆయన తెలిపారు. గుండుగొలనులో పదో తరగతి ఫలితాలపై ఆయన సంతృప్తిని వ్యక్తం చేసారు. భీమడోలు హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు కూడా ఐఎఫ్‌పీను రిమోట్‌తో ఆపరేట్ చేయడం చేసి తాను బోధించే సబ్జెక్టుకు సంబంధించిన అంశాలను చూపడంతో ప్రవీణ్ ప్రకాష్ ఆయనను అభినందించారు. దీనితో ఆ హెచ్‌ఎంలను శనివారం ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందించారు.


ఏలూరు సాయ్ సెంటర్ ఆవరణలో వ్యాయామాలు చేస్తున్న బాలలు


ఏలూరు భిశ్వనాథ్ భర్తియా స్విమ్మింగ్ పూల్‌లో చిన్నారులకు శిక్షణ


ఏలూరు ఇండోర్ స్టేడియంలో శిక్షణ పొందుతున్న బాలికలు

చిన్నారులకు 'ఆట'విడుపు

- క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభం
- ఉత్సాహంగా సాధన చేస్తున్న బాలబాలికలు

ఏలూరు రూరల్ : పిల్లలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసే వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏలూరు, జంగారెడ్డిగూడెంలో నెలరోజుల పాటు శిక్షణ శిబిరాలు నిర్వహిస్తోంది. ఈ నెల 15న ప్రారంభమైన ఈ శిబిరాలు జూన్ 14 వరకూ కొనసాగుతాయి. ఈ ఏడాది వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు సార్వత్రిక ఎన్నికలు ఆటంకం కలిగించాయి. ఏటా మే 1వ తేదీన ప్రారంభం కావల్సిన శిబిరాలు 15 తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. దీనికి కారణంగా శిక్షణ శిబిరాలు నిర్వహించే పాఠశాలల్లో ఎన్నికల సంఘం పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసింది. దీనికి తోడు మే ప్రారంభంలో తీవ్రమైన ఎండలు సైతం అడ్డుకున్నాయి. ఇప్పుడు ఎండల తీవ్రత తగ్గడంతో పాటు ఎన్నికలు సైతం పూర్తి కావడంతో అధికారులు ఆటలపై దృష్టి పెట్టారు.

శిక్షణ శిబిరాలు ఇవే

ఈ నెల 15న అధికారులు శిక్షణ శిబిరాల వివరాలు వెల్లడించారు. ఇందులో ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఫుట్‌బాల్ క్రీడలో కోచ్ ఎండీ సిరాజుద్దీన్ శిక్షణ అందిస్తారు. ఇండోర్ స్టేడియంలో వెయింట్ లిఫ్టింగ్ శిక్షణకు ఎం రమేష్, హేండ్ బాల్ ఆర్ మోహన్‌రవికుమార్, సీఆర్‌ఆర్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో టేబుల్ టెన్నిస్‌కు జి వెంకటేశ్వర్, బిజీటీఓ స్కూల్ ఆవరణలో వెయిట్‌లిఫ్టింగ్ టి సీతాభవాని శిక్షణ ఇస్తారు. భిశ్వనాథ్ భర్తియా స్విమ్మింగ్ పూల్‌లో బి గణేష్, ఇండోర్ స్టేడియంలో స్కేటింగ్ శిక్షణకు షేక్ ఖాసిం, అల్లూరి సీతారామరాజు స్టేడియంలో వెయిట్ లిఫ్టింగ్‌కు బి శ్రీను బాలబాలికలకు శిక్షణ అందిస్తున్నారు. ఇదే క్రమంలో పోలసానిపల్లి సోషల్ వెల్ఫేర్ స్కూల్లో అథ్లెటిక్స్‌కు జి కృష్ణకుమారి, జంగారెడ్డిగూడెం యర్ర కాలవ వాటర్‌స్పోర్ట్స్ ఆవరణలో ఎం రాజేష్ శిక్షణ అందిస్తారని అధికారులు వివరించారు. ఆసక్తి గల బాలబాలికలు 98663-17326 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు. జిల్లాలోని క్రీడా సంఘాలు తమ ప్రాంతాల్లో శిక్షణ అందిస్తున్నారు.


ఏలూరు కస్తూర్బా బాలికల పాఠశాలలో శిక్షణ పొందుతున్న బాలికలు

ఆటలతో సేద తీరనున్న బాలబాలికలు

ఏడాది పొడవున పుస్తకాలతో కుస్తీ పడిన విద్యార్థులు ఆటలతో సేద తీరుతున్నారు. చదువు, మార్కులు, ఫలితాల ఒత్తిడి నుంచి పిల్లలను దూరం చేసేందుకు ఇదే సరైన సమయమని తల్లిదండ్రులు బావిస్తున్నారు. సెలవుల్లో అందించే శిక్షణతో పిల్లలు ఉత్తమ క్రీడాకారులుగా తయారవుతారు.

శిక్షణ శిబిరాలు ఏర్పాటు



రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు 15వ తేదీ నుంచి శిబిరాలు ప్రారంభించాం. జిల్లా హెడ్ క్వార్టర్ ఏలూరులో 10కు పైగా క్రీడాంశాల్లో శిక్షణ అందిస్తున్నాం. ఇప్పటికే పిల్లలు పెద్ద సంఖ్యలో చేరారు. ఆసక్తి గల పీడీ, పీఈటీ, సీనియర్ క్రీడాకారులను గ్రామీణ ప్రాంతాల్లో సైతం క్యాంప్‌లు నిర్వహించేలా ప్రోత్సహిస్తున్నాం.

– బి శ్రీనివాసరావు, జిల్లా చీఫ్‌కోచ్

సాధన చేసే సమయం ఇదే



ఏడాది పొడవునా పిల్లలు పుస్తకాలతో కుస్తీ పట్టారు. బడికి సెలవులు రావడంతో ఇప్పుడు ఆటలపై ఆసక్తి చూపుతారు. ఇదే సమయంలో వారిలో ప్రతిభ గుర్తించి శిక్షణ అందిస్తే క్రీడాకారులుగా రూపుదిద్దుకుంటారు. కొన్నేళ్లుగా ఏలూరు కస్తూర్బా బాలికల పాఠశాలలో బాస్కెట్‌బాల్ శిక్షణ అందిస్తున్నాం.

– కె మురళీకృష్ణ, పీఈటీ, ఏలూరు

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరం


జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శిక్షణ పొందుతున్న బాలలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. ఆదివారం ఉదయం 8 గంటలకు వివిధ పాఠశాలల విద్యార్థులకు ముందుగా ప్రార్థనా గీతాలతో కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టోరీ టెల్లింగ్ అంశంలో భాగంగా నీతి కథలు, దేశభక్తి కథలు, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలను విద్యార్థులతో చెప్పించారు. టీచర్ వీ. నళిని విద్యార్థులకు దేశభక్తి గీతాలను పాడడం నేర్పించారు. క్రాఫ్ట్ నిపుణులురాలు డీ. శ్రీవల్లి ప్లాస్టిక్ బాటిళ్లతో గృహాలంకరణ సామగ్రిని తయారు చేయడంపై శిక్షణనిచ్చారు. అనంతరం హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బి.దుర్గా ప్రసాద్ బృందం విద్యార్థులకు మైండ్ పవర్ గేమ్స్, మెమరీ గేమ్స్‌లో శిక్షణిచ్చారు. ఈ శిబిరాన్ని ఉప గ్రంథపాలకుడు ఏ. నారాయణ రావు పర్యవేక్షించగా, గ్రంథాలయ సిబ్బంది వీటీ సందీప్ కుమార్, ఎండీ అస్లాం పాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

మామిడి రైతులను ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): తెగుళ్ల వల్ల నష్టపోయిన మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నిమ్మగడ్డ నర్సింహా, కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నూజివీడు, చింతలపూడి ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో మామిడి తోటలున్నాయని, మామిడి పంటపై ఆశలు పెట్టుకుని రైతులు సాగు చేస్తున్నారన్నారు. ఈ ఏడాది మామిడి పంటను తెగుళ్లు ఆశించి దిగుబడులు బాగా తగ్గాయని మరో వైపు గాలి వానల ఫలితంగా కాయలు రాలిపోయి నష్టపోయారని తెలిపారు. ఇతర రాష్ట్రాలకు ఇతర దేశాలకు ఇక్కడ నుంచి మామిడి ఎగుమతులు అవుతున్నాయని గుర్తు చేశారు. తెగుళ్ల నివారణకు సంబంధిత అధికారులు దృష్టి సారించాలన్నారు. మామిడి పంటను, రైతులను రక్షించేందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఎలక్ట్రికల్ కార్మికుడికి ఆర్థిక సాయం అందజేత

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్, హేలాపురి ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ (ఇఫ్టూ అనుబంధం) ఆధ్వర్యంలో కార్మికుని కుమార్తె వివాహానికి రూ.15వేలు ఆర్థిక సాయాన్ని అందజేసారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు లింగమల్లు శ్రీనివాసరావు, బత్తిన శ్రీనివాసరావు ఆదివారం గొటుకుల లక్ష్మణరావు ఇంటికి వెళ్లి యూనియన్ తరుపున వివాహ ఖర్చుల నిమిత్తం రూ.15 వేలు అందించారు. బీఓసీలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న దాదాపు 40వేల క్లెయిమ్‌లను అధికారులు త్వరగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి మైచర్ల శంకర్రావు, కమిటీ సభ్యులు వి.నాగేశ్వరరావు, కె.సహదేవుడు, సిరిగిరి సత్యనారాయణ పాల్గొన్నారు.


ఎలక్ట్రికల్ వర్కర్ లక్ష్మణరావు కుమార్తె వివాహానికి ఆర్థిక సాయం అందిస్తున్న యూనియన్ నేతలు

ఆదర్శ నాయకుడు సుందరయ్య

ఏలూరు (టూటౌన్): తన జీవితాన్ని ప్రజా సేవకే అంకితం చేసిన గొప్ప నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య అని, విగ్రహాలు కాదు గ్రంథాలయాలు నెలకొల్పండి అని చెప్పిన దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, ఆదర్శ నేత అని పలువురు వక్తలు కొనియాడారు. కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా స్థానిక గాంధీ నగర్ సుందరయ్య గ్రంథాలయం వద్ద కంది విశ్వనాథం అధ్యక్షతన ఆదివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తలుగా పాల్గొన్న కమ్యూనిస్టు నాయకులు బుద్దా సోమయ్య, బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సుందరయ్య ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపారని, తన జీవితాన్ని ప్రజా సేవకే అంకితం చేశారన్నారు. పిల్లల్ని సైతం వద్దనుకుని కార్మిక, కర్షక, కష్ట జీవుల కోసం జీవితాంతం పోరాడారని కొనియాడారు. పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను ముందుకు తీసుకెళుతూ ఆయన స్ఫూర్తితో గ్రంథాలయాలను విజ్ఞాన కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.వర్ధంతి సభ అనంతరం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. జె.గోపి,ఎం.ఇస్సాక్ నాయకత్వం వహించిన ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి పి.కిషోర్, సీహెచ్ అమర్ కుమార్, సీహెచ్ సుందరయ్య, ఇందిరా, కె.లెనిన్, ఠాగూర్ రాజా తదితర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.


పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న బుద్దా సోమయ్య

ఘనంగా ప్రారంభమైన కల్యాణోత్సవాలు

భీమడోలు: గుండుగొలనులో వేంచేసియున్న కలియుగ దైవం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నుంచి కల్యాణోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవదాయ ధర్మశాఖ ఆధ్వర్యంలో ఆలయ పూజారి మంగపతి ఆచార్యులు స్వామి వారికి విశేష పూజలు చేసారు. ఆలయంలో మేళ తాళాల నడుమ స్వామి వారిని పెళ్లి కుమారుని తంతు ఘనంగా నిర్వహించారు. స్వామి వారిని సుందరంగా అలంకరించి ముస్తాబు చేసారు. రాత్రి ధ్వజారోహణం వేడుక కన్నుల వేడుకగా నిర్వహించారు. ఆలయంలోని ధ్వజ స్తంభానికి గరుడ పెళ్లి పత్రికను ఉంచి సకల దేవతలకు ఆహ్వానం పలికారు. ఆలయ ట్రస్టీ చైర్మన్ వగ్వాల మీనాకుమారి, అచ్యుతరామారావు పూజలు చేసారు. ఈనెల 21న స్వామి వార్లకు కల్యాణం నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పెద్దలు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.


ఆలయ ధ్వజ స్తంభం వద్ద గరుడ పెళ్లి పత్రికను ఉంచిన పూజారులు, ఆలయ ట్రస్టీ చైర్మన్ దంపతులు

ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలి

భీమడోలు: ఎయిడ్స్ రహిత సమాజస్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని భీమడోలు సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సంతోష్‌కుమార్ అన్నారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆదివారం రాత్రి అంతర్జాతీయ ఎయిడ్స్ దీప స్మృత్యాంజలి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎయిడ్స్, హెచ్‌ఐవీ వంటి ప్రాణాంతక వ్యాధులతో మృతి చెందిన వారిని గుర్తు చేసుకుంటూ వారి పట్ల ప్రేమ, సంఘీభావం తెలియజేద్దాం.. వారి కుటుంబ సభ్యుల బాధను నయం చేద్దాం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆసుపత్రిలో ఎయిడ్స్ చిహ్నంలా కొవ్వొత్తులను వెలిగించారు. ఈ సందర్భంగా వెలిగించిన కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. డాక్టర్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ ఎయిడ్స్, హెచ్‌ఐవీ వంటి రోగాలపై ప్రజలను చైతన్యవంతులు చేసేందుకు ఏటా మే 3వ ఆదివారం ఎయిడ్స్ దీప స్మృత్యాంజలి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎయిడ్స్, హెచ్‌ఐవీ బాధితుల పట్ల ప్రతి ఒక్కరూ ప్రేమానురాగాలు కలిగి ఉండాలన్నారు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న భయానక రోగాలను తరిమి కొట్టేందుకు మనమంతా కృషి చేయాలన్నారు. ఎయిడ్స్, హెచ్‌ఐవీ రోగులకు ప్రభుత్వం ఉచితంగా మందులను అందిస్తుందని, వాటిని వాడితే జీవితకాల పరిమితి పెరుగుతుందన్నారు. ఐసీటీసీ కౌన్సలర్ సీహెచ్ సింహాద్రి, సిబ్బంది పాపారావు, సిస్టర్ పి.విక్టరీ, ల్యాబ్ సిబ్బంది అనిల్, గ్రామస్తులు పాల్గొన్నారు.


భీమడోలు సీహెచ్‌సీ వద్ద కొవ్వొత్తులతో ప్రదర్శనలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం

భీమడోలు: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయఢంకా మోగించాలని కోరుతూ ఆదివారం పెదలింగంపాడులో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక ప్రార్థనలు చేసారు. భీమడోలు పంచాయతీ పరిధిలోని పెదలింగంపాడులో మరియ మాతా ఉత్సవాల్లో మూడవ రోజైన ఆదివారం వార్డు సభ్యురాలు చల్లా విమల, నాయకులు చక్కా పుల్లయ్య ఆధ్వర్యంలో మరియ మాతా ఊరేగింపులో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొని ప్రార్థనలు చేసారు. జూన్ 4న నిర్వహించనున్న కౌంటింగ్‌లో రాష్ట్రంలో 175 ఎమ్మెల్యే స్థానాల్లో, 25 ఎంపీ స్థానాల్లోని వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో గెలవాలని కోరుతూ వారంతా ప్రత్యేక ప్రార్థనలు చేసారు. ఉంగుటూరు ఎమ్మెల్యేగా వాసుబాబు అధిక మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని వారు దీమా వ్యక్తం చేసారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే వారి గెలుపునకు సోపానాలని వారంతా పేర్కొన్నారు.


పెదలింగంపాడులో మరియ మాతా ఊరేగింపులో ప్రార్థన చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెదపాడు : పెదపాడు సబ్‌స్టేషన్ సెక్షన్ 33/11కేవీ పెదపాడు సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న 11కేవీ రాళ్లపల్లి వారిపాలెం ఫీడర్ 11కేవీ సత్యవోలు ఫీడర్ 11కేవీ గోగుంట ఫీడర్ న్యూలైన్ల నిర్మాణంతో పాటు లైన్ల మరమ్మతుల దృష్ట్యా ఈనెల 20,21,22 తేదీల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నటరాజన్ తెలిపారు. సోమ, మంగళ, బుధవారం ఉదయం 6 గంటలకు నుంచి మధ్యాహ్నం వరకు నిలుపుదల చేస్తామని తెలిపారు. ఫీడర్ పరిధిలోని ఖాజీగూడెం, గుడిపాడు, సత్యవోలు, సకలకొత్తపల్లి, కొణికి, గోగుంట, వసంతవాడ, తోటగూడెం, పునుకొల్లు, నాయుడుగూడెం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	07
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	23
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	34
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	11

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	03
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21,.15	4822	05
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	01
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	04
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	00
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	01
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	01
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.20	98511	35
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.10	98503	32
ఏలూరు - తిరుపతి	16.00	4830	07

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	38	చిక్కుడు కాయలు	--
వంకాయలు (కాంతులు)	44	చామదుంపలు	54
వంకాయలు (తెలుపు)	48	ములక్కాడలు	04, 06
బెండకాయలు	44	కంద	64
పచ్చిమిర్చి	84	బీట్‌రూట్	36
కాకర కాయలు	36	కీరా దోస	40
బీరకాయలు	44	ఫ్రెంచ్‌బీన్స్	180
బీరకాయలు (పందిరి)	58	అల్లం	180
క్యాబేజీ	32	కొత్తిమీర (కట్ట)	30
క్యారెట్	38-52	పాలకూర	12
దొండకాయలు	36	చుక్కకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	29	గోంగూర	07
గోరుచిక్కుడు	58	పుదీనా	05
దోసకాయలు	18-24	బఠాణీ	--
ఆనబకాయ (1)	18-20	క్యాప్సికమ్	68
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	40

సెల్ టవర్ నిర్మాణ పనుల ప్రారంభం

టి.నరసాపురం: మండలంలోని గిరిజన గ్రామాలకు మంచి రోజులు వచ్చాయని వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కురసం నిరీక్షణరావు అన్నారు. మండలంలోని మర్రిగూడెంలో రూ. 1.40 కోట్లతో మంజూరైన బీఎస్ఎన్ఎల్ టవర్ నిర్మాణానికి నిరీక్షణరావు, సర్పంచ్ సోయం బిందు ఆదివారం కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిరీక్షణరావు మాట్లాడుతూ మండలంలోని మర్రిగూడెం, చుట్టుపక్కల గ్రామాలకు ఎటువంటి సెల్ సిగ్నల్స్ లేక గత కొన్నేళ్లుగా నానా ఇబ్బందులు పడుతున్నామన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడాలంటే గట్లు, డాబాలు ఎక్కాల్సిందేనని వివరించారు. గిరిజనుల కష్టాలను ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు దృష్టికి తీసుకువెళ్లామని వివరించారు. వారి సహకారంతో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ మంజూరైందని తెలిపారు. దీంతో ఆ పనులను ప్రారంభించినట్లు వివరించారు. నెలరోజుల్లో టవర్ నిర్మాణం పూర్తవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ మండలాధ్యక్షుడు కురసం రవీంద్రబాబు, యూత్ నాయకులు పూసం సూర్యచంద్రం తదితరులు పాల్గొన్నారు.

భూముల సారవంతానికి నవధాన్యాల అందజేత


ఖరీఫ్ సీజన్లో రైతులకు పంచేందుకు సిద్ధం చేసిన నవధాన్యాల బ్యాగులు

కొయ్యలగూడెం: ఖరీఫ్ సీజన్లో భూముల సారవంతానికి రైతులకు నవధాన్యాలను అందజేస్తున్నట్లు ఏడీఏ పి.బుజ్జిబాబు పేర్కొన్నారు. కొయ్యలగూడెం ఏఎంసీ యార్డు ప్రాంగణంలో అందించేందుకు పద్దెనిమిది రకాల కలిగిన నవధాన్యాల బ్యాగులను సిద్ధం చేశామన్నారు. పీఎండీఎస్ పథకం ద్వారా ప్రకృతి వ్యవసాయ శాఖ డీపీఎం తాతారావు ఆధ్వర్యంలో కేఆర్‌పురం పరిధిలోని రైతులకు వీటిని ఖరీదుకు అందజేయడం జరుగుతుందన్నారు. పదికేజీల బ్యాగ్ రూ.800కు అందిస్తున్నామని, తమ పరిధిలోని రైతులందరికి ఇది వర్తిస్తుందని తెలిపారు. గతంలో పచ్చిరొట్ట భూసార అభివృద్ధికి దోహదపడేది అని, అయితే నలభై ఐదు రోజుల వయసు ఉన్న నవధాన్యాల పంటను అదును చూసి దున్నుకోవడం వల్ల రైతులకు ఐదు టన్నుల పచ్చిరొట్ట భూసారంతో సమానం అవుతుందని అన్నారు. పప్పు జాతి, చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, ఆయిల్ సీడ్స్ తదితర రకాలను నవధాన్యాలలో మిశ్రమమై ఉంటాయన్నారు. కావలసిన రైతులు వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించవచ్చు అని సూచించారు.